క్లుప్తంగా

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కేశవ

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్ఐ ఎం.కేశవ సూచించారు. మంగళవారం రాత్రి దుద్యాల గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, ఆన్‌లైన్ గేమ్‌లు, లోన్స్ మోసాలనుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా ఫోన్లు చేసి మీకు లోన్ మంజూరైందని, గేమ్స్ ద్వారా డబ్బులు గెలుచుకున్నారని మోసం చేసేందుకు యత్నిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు.

జగజ్జీవన్‌రావు విగ్రహం ఏర్పాటు చేస్తాం



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నందికొట్కూరు: మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగజ్జీవన్‌రావు విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు రాఘవయ్య, ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. వారు మాట్లాడుతూ జెండాను ఆవిష్కరించిన స్థలంలో బాబూ జగజ్జీవన్‌రావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు, సోమన్న, తిరుపాలు, జాను, ఈశ్వరయ్య, ప్రకాశం, సతీష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన కేసులో భర్త అరెస్ట్



నిందితుడిని చూపుతున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: ఈనెల 15న భార్య నజీమూన్‌ను హత్య చేసిన కేసులో భర్త మొల్ల అబ్దుల్లా, అత్త మొల్ల రఫియాబీలను అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పోలీసు స్టేషన్‌లో నిందితుల వివరాలను విలేకరులకు వెల్లడించారు. గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన నిందితులు కొద్ది రోజుల క్రితమే మండల కేంద్రానికి వచ్చి జీవనం సాగిస్తున్నారు. బీఎస్ఎస్ఆర్ నగర్‌లో ఇంటి వద్ద ఉండగా నిఘా ఉంచి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలి

మహానంది: మహానందిలోని నాగనంది వసతి గృహాలను కూల్చే సమయంలో ప్రమాదవశాత్తూ ఇద్దరు కార్మికులు మృతి చెందడం బాధాకరమని సీపీఐ మండల కార్యదర్శి ఆర్.సామేలు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరికి రూ. 20 లక్షల పరిహారంతో పాటు వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అమ్మవారికి కొబ్బరి కాయల సమర్పణ



కొబ్బరి కాయలు సమర్పిస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబ దేవి అమ్మవారికి మంగళవారం కొబ్బరికాయలు సమర్పించారు. ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించారు. తర్వాత అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

బండి ఆత్మకూరు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు రత్నమయ్య, ఏసేపు, ప్రవీణ్, రామ చంద్రుడు, పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మంగళవారం వారు మండల పరిధిలోని శింగవరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గుంతలు పడిన రహదారులతో ఇబ్బంది పడుతున్నామని, మినీ వాటర్ ట్యాంక్ తాగునీటి సమస్య నెలకొందని, మురుగు కాలువలు లేక మురుగు వీధుల్లోకి చేరి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని ప్రజలు నాయకులకు విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

నిర్లక్ష్యానికి పా'ఛీ'పట్టింది

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి ఇక్కడ కనిపిస్తున్న నెహ్రూనగర్ ఎస్సీ కాలనీలోని తాగునీటి ట్యాంక్ నిలువెత్తు నిదర్శనం. ట్యాంక్ చుట్టు చెత్తాచెదారం పేరుకుపోవడమే గాకుండా ట్యాప్‌ల సదుపాయం కూడా సరిగా లేకపోయినా ఇటు సర్పంచ్ కానీ.. అటు పంచాయతీ అధికారులు కానీ పట్టించుకోకపోవడం సిగ్గుచేటు. ట్యాంక్‌ను 15 రోజులకోసారి శుభ్రం చేయాలన్న ధ్యాసే మరిచిపోయారు. దీంతో పాచి పట్టి పరిసరాలు దుర్గంధంగా మారాయి. అయినా తప్పని పరిస్థితుల్లో అదే నీటిని పట్టుకుని దాహం తీర్చుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి సిబ్బందితో ట్యాంక్‌ను శుభ్రం చేయించి, శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.



ఎస్సీ కాలనీలో పాచిపట్టి దుర్వాసన వెదజల్లుతున్న మంచినీటి ట్యాంక్

పగిద్యాల

ఉపాధి కూలీల ఆవేదన



పనులు కల్పించాలని ఎంపీడీఓను కోరుతున్న కూలీలు

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించే విషయమై గ్రామనాయకుల మధ్య నెలకొన్న రాజకీయ వివాదం వల్ల ఉపాధి పనులు ఆపేసి తమ కడుపులు కొట్టడం భావ్యం కాదని జూపాడుబంగ్లా మండలం తాటిపాడు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. పనులు కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని మంగళవారం ఎంపీడీఓ గోపికృష్ణకు విన్నవించుకున్నారు. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో ఖాళీగా ఉన్నామని, మిగతా అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నా, తమ గ్రామంలో మాత్రమే ఇంతవరకు పనులు మొదలు పెట్టకపోవడంతో తమకు వలసలే దిక్కని తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎంపీడీఓ.. ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వటంతో కూలీలు వెనుదిరిగారు.

జూపాడుబంగ్లా

మహానంది ఘటనపై ఆరా



ప్రమాదానికి కారణమైన వసతి సముదాయం

మహానందిలో నాగనంది సదనం సముదాయంలోని వసతి గృహాలను కూల్చివేస్తుండగా ఇద్దరు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆరా తీశారు. ప్రమాద ఘటనపై కమిషనర్ రామచంద్రమోహన్ ఫోన్‌లో ఈఓ శ్రీనివాసరెడ్డిని అడిగి వివరాలు సేకరించారు. పాత గదులను కూల్చడానికి అన్ని రకాల అనుమతులిచ్చినట్లు ఆయన 'సాక్షి' తెలిపారు. దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ బుధవారం మహానందికి రానున్నట్లు తెలిసింది. కాగా 1998-99లో సుమారు 12, 2015లో 13 వసతి గృహాలు నిర్మాణానికి అప్పట్లోనే దాతలు ముందుకు వచ్చి రూ.లక్షలు విరాళమిచ్చారు. ప్రస్తుతం రూ.10.50 కోట్లతో 50 గదుల నిర్మాణం కోసం పాత వాటిలో 12 గదులను తొలగించాల్సి ఉంది. ఈ విషయం దాతలకు సమాచారం ఇవ్వకపోవడంతో పలువురు దాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహానంది

లోతు దుక్కులతో నేల సారవంతం



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు

కొత్తపల్లి: పంట పూర్తయిన తర్వాత వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవడం వల్ల నేల సారంవంతమవుతుందని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.ఆంజనేయ సూచించారు. మంగళవారం మండల వ్యవసాయాధికారి కె.మహేష్ ఆధ్వర్యంలో గుమ్మడాపురం, శివపురం గ్రామాల పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ లోతు దుక్కుల వల్ల భూమి గుల్లబారుతుందని, భూమిలో ఉన్న కీటకాలు ఎండవేడిమికి నశిస్తాయని తెలిపారు. ప్రతి రైతు పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా ఆహారం కలుషితం కాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుమ్మడాపురం సర్పంచు నక్కా విజయ్‌కుమార్, ఉపసర్పంచు బొల్లు శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ రామాంజనేయ నాయక్

పగిద్యాల: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలని జూపాడుబంగ్లా డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రామాంజనేయ నాయక్ సూచించారు. మండలంలోని పడమర ప్రాతకోట కొనసాగే టీకా కార్యక్రమాన్ని ఏడీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 నెలల దూడల నుంచి పెద్ద పశువుల వరకు టీకాలు వేయించాలన్నారు. గాలికుంటు వ్యాధి బారిన పడిన పశువుల నోటి వెంట తెల్లని నురుగ కారుతుందన్నారు. మేత మేయడానికి ఇబ్బంది పడతాయన్నారు. కాలి గెట్టలకు పుండ్లు, నోట్లో పండ్లు ఏర్పడి పశువులు బరువు తగ్గుతాయన్నారు. పాలిచ్చే పశువులు ఈ వ్యాధికి గురైతే పాల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందన్నారు. పశుపోషకులు గుర్తించి తెల్ల, నల్లటి పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకుని, మృత్యువాత పడకుండా కాపాడుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పశువైద్యులు సుమన్, జేవీఓ క్లారికుమారి, ఏహెచ్ఏ సంధ్య ఉన్నారు.

వయోజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

- జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు



పరీక్షల నిర్వహణ వివరాలను తెలియజేస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు

జూపాడుబంగ్లా: నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉల్లాస్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వయోజన విద్యాకేంద్రాల వలంటీర్లకు, వీఓఏలు, సీసీలకు అవగాహన కల్పించారు. వయోజన విద్యాకేంద్రాల్లో వలంటీర్లు నిరక్షరాస్యులకు నేర్పిన పాఠ్యాంశాలపై ఈనెల 23న పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు వారి వీలును బట్టి పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అంబమ్మ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి



ఉపాధి సమస్యలపై మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

పగిద్యాల: స్థానిక పంచాయతీకి ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఉపాధి కూలీలతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీల్డ్‌అసిస్టెంట్‌లను తొలగిస్తూ గ్రామాల్లో వారి పొట్ట కొడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనుకూలమైన వారిని ఫీల్డ్‌అసిస్టెంట్‌లుగా నియమించుకునేందుకు గతంలో పనిచేసిన వారిపై లేనిపోని ఆరోపణలు చేసి తొలగించడం తగదన్నారు. రాజకీయాలు పక్కనపెట్టి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం తాలూకా అధ్యక్షులు చెరుకుచెర్ల సుధాకర్ పాల్గొన్నారు.

సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: గ్రామాల్లో చేపట్టిన సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మలూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అలాగే జూటూరు గ్రామంలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జీఎస్‌డబ్ల్యూఎస్, ఇంటింటి సర్వే, వర్క్ హోమ్ సర్వేలు వేగవంతం చేయాలని చెప్పారు. సర్వే పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి సర్వే వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ రంగనాయక్ ఉన్నారు.

జాబ్‌మేళాలో 32 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. నాలుగు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరై నిరుద్యోగులను ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ బి.పద్మావతిబాయి తెలిపారు. 32 మంది నిరుద్యోగులకు ఉద్యాగాలు దక్కాయన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ఇలాంటి జాబ్‌మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి



ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పాములపాడు: సమస్యలను పరిష్కరించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం మండల కార్యదర్శి సామన్న సూచించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని ఇస్కాల గ్రామంలో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. భవనాశి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. హైసూకల్ వరకు సీసీ రోడ్డు లేకపోవడంతో తీవ్ర సమస్య ఎదుర్కొంటున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో పార్టీ చేయబోతున్న పోరాటాలకు, ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వరరావు, ఏసేపు, జయరాజు, సురేష్, రంగస్వామి పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: ఈనెల 19 నుంచి 22 వరకు గ్రామాల్లో నిర్వహించే ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి మంగళవారం తెలిపారు. దుద్యాల- 2 సెక్టార్ ప్రజలకు 19న ఎదురుపాడు గ్రామంలో, కొక్కెరంచ పంచాయతీ ప్రజలకు 20న ఎదురుపాడు గ్రామ సచివాలయంలో 20లో, దుద్యాల గ్రామ సచివాలయంలో 21న, నందికుంట గ్రామంలో 22న ఆధ్యార్‌క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గోకవరం సెక్టార్ పరిధిలోని గ్రామాలలో ఎర్రమఠం 19న, ముసలిమడుగు గ్రామంలో 20, 21న, గోకవరం గ్రామంలో 22వ తేదీలలో క్యాంపులు ఉంటాయని, ఆధార్ కార్డులో చేర్పులు మార్పులు ఉంటే సరిచేయించుకోవాలన్నారు. బయోమెట్రిక్ అథెంటికేషన్ కూడా చేయించుకోవచ్చన్నారు.

జూపాడుబంగ్లా: ఈనెల 19న తంగడంచ, పారుమంచాల, 20న తరిగోపుల, తంగడంచ, 21న మండ్లెం, జూపాడుబంగ్లా-2 , 22న జూపాడుబంగ్లా-2, భాస్కరాపురం గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు.

పాములపాడు: ఈనెల 19న పాములపాడు, 20న వేంపెంట, 21న యర్రగూడూరు, 22న ఇస్కాల, 25న జూటూరు-2, 26న జూటూరు-1, 27న పాములపాడు-2, 28న మిట్టకందాల గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు.

21న మండల సర్వసభ్య సమావేశం

జూపాడుబంగ్లా: ఈనెల 21న జూపాడుబంగ్లా మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. మండలస్థాయి అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి హాజరుకావాలని కోరారు. మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికల జిరాక్సు కాపీలను ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రంలోగా అందజేయాలన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పగిద్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశానికి మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సుజన కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఉన్నందున ఆసక్తి ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు నెట్ సెంటర్లలో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఓబీసీ విద్యార్థులు దరఖాస్తు రుసుం రూ.200లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పదవ తరగతి మార్కుల మెమో ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, దూర ప్రాంతం నుంచి చేరే విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం ఉందని తెలిపారు.

● **మహానంది:** మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మణరావు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరాలనుకునే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

వ్యక్తికి గాయాలు

నందికొట్కూరు: మండల పరిధిలోని 10 బొల్లవరం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి ఆటో-బైక్ ఢీకొన్న ఘటనలో నందికొట్కూరు పట్టణానికి చెందిన జయరాముడుకు గాయాలైనట్లు యి. బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోకి శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్రస్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



రైతులకు సూచనలు తెలియజేస్తున్న డీఆర్‌సీ ఏఓ హేమలత

ఆత్మకూరు: వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్‌సీ ఏఓ హేమలత రైతులకు సూచించారు. మండలంలోని కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పంటల్లో సస్యరక్షణ చర్యల తీసుకోవాలన్నారు. రైతుసేవా కేంద్రం వద్దకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీలో రిజిస్ట్రేషన్ చేయించుకుని ఐడీ నంబర్ పొందాలన్నారు. ఐడీ పొందడం వల్ల పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఎరువులు, సబ్సిడీ మొదలైన లాభాలు పొందవచ్చన్నారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జీవామృతం తయారీని రైతులకు డెమో చూపించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారిణి అరుణ పాల్గొన్నారు.

– **బండిఆత్మకూరు:** మండల పరిధిలోని పెద్ద దేవళాపురం, భోజనం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు 50 శాతం సబ్సిడీతో ప్రతి రైతు సేవా కేంద్రాలకు కేటాయించామన్నారు. పంట నమోదు ప్రక్రియలో అభ్యంతరాలున్న రైతులు ఆధారాలతో ఫిర్యాదు చేయాలన్నారు.

దళితవాడ అభివృద్ధి పట్టదా



మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూరు: దళితవాడ అభివృద్ధి పట్టదా అని సీపీఎం నాయకులు ఎ.రణధీర్, డి.రామ్‌నాయక్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఎస్సీజీ పాలెం, ఏబీఎస్ పాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితవాడల అభివృద్ధిని కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాలనీలలో కాలువలను శుభ్రం చేయకపోవడంతో పందులు, దోమలు వృద్ధి చెంది స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళిత వాడల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరన్న, చిన్న అంబయ్య, సామేలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు కోరారు. మంగళవారం జగనన్న కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతి లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు జగనన్న కాలనీపై చిన్నచూపు చూడటం తగదన్నారు. తక్షణమే మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నాఉ. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా, మధుబాబు, బాబు, గోకారి, షబ్బీర్, రామకృష్ణ, కాసీం, నరసింహ, రాజశేఖర్, మల్లికార్జున, అక్లింబాషా, మహమ్మద్‌రఫీ పాల్గొన్నారు.

వైద్యశాలను తెరిపించండి



ఆస్పత్రిని పరిశీలించి మాట్లాడుతున్న మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో రూ.83.40 లక్షల ఎంఎస్‌డీపీ నిధులతో నిర్మించిన వైద్యశాలను తెరిపించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసురత్నం, నరసింహనాయక్, మండల కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ప్రతినిధి బృందం గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం పూర్తయిన వైద్యశాలకు సిబ్బందిని కేటాయించకపోవడ, వైద్య పరికరాలు సమకూర్చకపోవడంతో ప్రజలకు సేవలు అందం లేదన్నారు. కాంట్రాక్టర్ లబ్ధి కోసమే వైద్యశాలను నిర్మించినట్లుగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యశాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

శాస్త్రోక్తంగా స్వాతి మహోత్సవం



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలం భక్త జన సంద్రంగా మారింది. స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదపడింతులు దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను అమృతవల్లీ అమ్మవార్లను దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అర్చకుల వేద మంత్రోచ్ఛాణలు.. ఆస్థాన విద్వాంసుల మంగళ వాయిద్యాల మధ్య శ్రీ స్వాతి, శ్రీసుదర్శన హోమాలు వైభవోపేతంగా నిర్వహించారు. పూర్ణాహుతితో ఆయా కార్యాక్రమాలు ముగించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి విశేష పుష్పాలకంరణ గావించిన ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు